ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన ఈడీ

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోను గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ ఎం రాజశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. మెకానికల్, బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి సంస్థ పట్ల అభిమానాన్ని చూరగొనాలని అన్నారు. శ్రావణమాసంను ఛాలెంజ్ మాసంగా తీసుకుని పని చేయాలన్నారు. జీరో ప్రమాదాలుగా డ్యూటీలు చేయాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఫోర్‌మెన్ బాలరాజు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన



కూకట్‌పల్లి: మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు ఓల్డ్ బోయినపల్లిలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో మాధవరం కాంతారావు మిత్రమండలి ఆధ్వర్యంలో అలయ్-బలయ్ కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సభాస్థలాన్ని ఆయన పరిశీలించి కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



కార్పొరేటర్‌తో కాలనీవాసులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సబ్దార్‌నగర్ ఈ బ్లాక్ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ లేకపోవటంతో తీవ్ర సమస్య ఏర్పడింది. దీంతో కాలనీ వాసులు కార్పొరేటర్ సబిహా బేగంను శుక్రవారం కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గౌసుద్దీన్, రాము యాదవ్, రమేష్, రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

- అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశం
- జోనల్ కమిషనర్‌తో కలిసి పర్యటన



కేపీహెచ్‌బీ కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్, బాలాజీనగర్, మూసాపేట, ఫతేనగర్ డివిజన్ తదితర ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను ఎమ్మెల్యే జోనల్ కమిషనర్‌కు చూపించారు. సమస్యల పరిష్కార మార్గాలను పరిశీలించారు. మొదట జేఎన్‌టీయూ సర్కిల్, లులూ మాల్ ప్రాంతం, జేఎన్‌టీయూ నుంచి వసంత్‌నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ, స్కైవాక్‌ల ఏర్పాటు వంటివి వెంటనే చేపట్టాలని కోరారు. తద్వారా అత్యధిక రద్దీకి నిలయమైన కేపీహెచ్‌బీ కాలనీ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయని తెలిపారు. కూకట్‌పల్లిలో ఇప్పటికే పదేళ్ల కాలంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ఎన్నో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. కూకట్‌పల్లి ప్రాంతానికి వలసలు పెరిగాయని, పెరుగుతున్న జనాభా నేపథ్యంలో కొత్త ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలు తప్పనిసరిగా అవసరమన్నారు. ఇందులో భాగంగా వసంతనగర్ కాలనీ నుంచి గోకుల్ ఫ్లాట్స్ మీదుగా హైటెన్షన్ రోడ్డులో రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సూచించారు. కైత్లాపూర్ ఫ్లైఓవర్ రెండు వైపులా టీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగి వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కూడళ్ల విస్తరణతో పాటు ట్రాఫిక్ నివారణకు ఫ్రీ లెఫ్ట్‌లను విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, ఎస్‌సీ చిన్నారెడ్డి, ఈఈ రమేష్, డీఈ శంకర్, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్‌లో ఎమ్మెల్యే కృష్ణారావు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, కార్పొరేటర్ సతీష్ గౌడ్‌తో కలిసి శుక్రవారం పర్యటించారు. వేంకటేశ్వరనగర్, భవానీ నగర్‌ల మధ్యలో నాలాపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బ్రిడ్జి నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా మూసాపేట ఆంజనేయ నగర్‌లో ఫ్లై ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం, కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి, అండర్‌పాస్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, కంచి బిక్షపతి, మల్లేష్, వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.

నాటి అభివృద్ధిని వివరించాలి

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఒక పని కూడా చేయలేదని, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ డా. ఉమాగౌరి



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి

కూకట్‌పల్లి: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డా ఉమాగౌరి అన్నారు. కూకట్‌పల్లి యూపీహెచ్‌సీలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూపీహెచ్‌సీ ప్రాంగణంలో అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు అనేది ప్రాణాంతకంగా మారే అలవాట్లలో ఒకటని అన్నారు. పొగుకు వినియోగం వల్ల కేవలం దానిని వాడే వారికే కాకుండా చుట్టూ ఉన్నవారికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పొగాకు రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ప్రోగ్రాం అధికారి డా. బి. మల్లేశ్వరి, యూపీహెచ్‌సీ కూకట్‌పల్లి వైద్యాధికారి డా. మమత తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడలో నివసించే మంగలి శంకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దొడ్ల రామకృష్ణగౌడ్ శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో శంకర్, మల్లేష్, ఫారూఖ్, శివ పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండలం ఎల్లమ్మబండలోని జన్మభూమి కాలనీ, అంబేడ్కర్ నగర్ మధ్య గల ప్రధాన రహదారిలోని నల్లపోచమ్మ దేవాలయం స్థలంలో భూ కబ్జాదారులు నిర్మించిన అక్రమ కట్టడాన్ని మండల ఆర్‌ఐ అగస్టన్ శుక్రవారం కూల్చివేత చేపట్టారు. గతంలో కూడా ఇదే స్థలంలో అక్రమ నిర్మాణం చేపడితే కూలగొట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: ఆంజనేయనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగప్ప శుక్రవారం తెలిపారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు హబీబ్‌నగర్, పవర్ నగర్ పార్కు, ప్రగతి నగర్, వసుంధర హాస్పిటల్ ప్రాంతాల్లో 10.30 నుంచి 11 గంటల వరకు ఆంజనేయ నగర్ జనతానగర్, మూసాపేట, ఇంద్రానగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు న్యూ బాలాజీనగర్, వివేక్‌నగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు కేపీహెచ్‌బీ 7వ ఫేజు, రాఘవేంద్ర కాలనీ, రంగనాయకస్వామి ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

పరీక్ష ఏర్పాట్లు పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: గ్రామ పాలన అధికారుల పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కూకట్‌పల్లిలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 27న జరగనున్న గ్రామ పాలన అధికారి పరీక్ష నిర్వహణపై అదనపు కలెక్టరు తన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 55 మంది అర్హులైన ఆప్షన్ ఇచ్చిన వీఆర్‌ఓలు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ, మెడికల్, ఎలక్ట్రిసిటీ సంబంధిత శాఖల వారు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

హరిహర క్షేత్రం పాలక మండలి సభ్యులకు సన్మానం



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో పదవీ కాలం పూర్తి చేసుకున్న పాలకమండలి చైర్మన్, కమిటీ సభ్యులను శుక్రవారం ఆలయ ఈవో సతీష్ బాబు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం పాలక మండలి కృషి చేశారని తెలిపారు. అనంతరం ఆలయ చైర్మన్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. సంవత్సర కాలంలో హరిహర క్షేత్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ మూర్తి, వెంకటేష్ యాదవ్,లక్ష్మీ నారాయణ, మనెమ్మ, సంతోష్ కుమార్, అర్చకులు బలరామ్ శర్మ, అంజి స్వామి, యోగానంద తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రక్షణకిట్లు అందజేత

మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలను కార్పొరేటర్ మహేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అందజేసిన రక్షణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జమీల్, అహ్మద్, డివిజన్ జవాన్ యాదగిరి, ఎస్‌ఎఫ్‌ఏ, నాయకులు అబ్బాస్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కూల్ కిట్లు



మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో సేల్స్ ఫోర్స్ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఫండ్స్‌లో భాగంగా 80 మంది విద్యార్థులకు స్కూల్ కిట్ అందజేశారు. బీజేపీ నాయకులు బూరుగుపల్లి రామ్మోహన్ అభ్యర్థన మేరకు కంపెనీ ప్రతినిధులు స్కూల్ బ్యాగ్, పుస్తకాలు, స్టేషనరీ, లంచ్ బాక్స్, వాటర్ బాటిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సింహాచలం, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బాకీ, సభ్యులు రాంరెడ్డి, విష్ణు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం



ఆల్విన్‌కాలనీ: మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా కూకట్‌పల్లి సుమిత్రానగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో ప్రధాన అర్చకులు అనంత ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై సామూహిక కుంకుమార్చనలు చేశారు.